# ఓట్ల లెక్కింపులో అప్రమత్తత అవసరం

**పశ్చిమ ఆర్వో కె. రాజ్యలక్ష్మి**

**నెహ్రూనగర్:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధి విధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గురువారం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆమె సూచించారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ , పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపునకు ఐదు టేబుల్స్ కేటాయించామని తెలిపారు. లెక్కింపు మొత్తం 21 రౌండ్స్‌లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. తొలుత పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించనున్నట్లు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన



అధికారులతో సమావేశమైన అదనపు కమిషనర్, పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మి

సూచనలను ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన వారు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని ఆమె సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్ అనుమతి లేనందున డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండేలా పర్యవేక్షణ చేయాలని ఈఈని ఆదేశించారు. కౌంటింగ్ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకావాలని ఆమె తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలోకి వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండాలని సూచించారు. అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను చెక్‌లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాసరావు, ఈఈలు కొండారెడ్డి, కోటేశ్వరరావు, డీఈఈ రఫీక్, సూపరింటెండెంట్లు వెంకటరామయ్య, పద్మ, ఏసీపీ అజయ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జగనన్న అభివృద్ధి, సంక్షేమాలే విజయానికి సోపానాలు

**నెహ్రూనగర్:** జగనన్న చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు విజయ సోపానాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తుళ్లూరి సూరిబాబు పేర్కొన్నారు. పాత గుంటూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గాలికి ఈసారి తెలుగు దేశం కంచుకోటలు సైతం బద్దలవ్వడం ఖాయమని తెలిపారు. ఏపీలో వైఎస్సార్ సీపీ తిరుగులేని ఆధిక్యంతో విజయ దుందుభి మోగిస్తుందని చెప్పారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. పేదలకు మరింత సంక్షేమాన్ని అందించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తారని పేర్కొన్నారు.

### నీట్‌కు ఉచిత అవగాహన తరగతులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** నీట్–2025కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఐదు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఏ.మనోజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మొదటి ప్రయత్నంలోనే మెరుగైన ర్యాంకుకు అవలంబించాల్సిన పద్ధతులపై సీనియర్ సబ్జెక్టు నిపుణులు, మెడికోలతో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 90908 98928, 90908 98902 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### శేషేంద్రశర్మ ప్రతి కవితా మహా కావ్యం



సభలో మాట్లాడుతున్న కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి

**లక్ష్మీపురం:** తెలుగు సాహితీ వనంలో అనేక మధుర పుష్పాలు పరిమళింపజేసిన గుంటూరు శేషేంద్ర శర్మ ప్రతి కవితా ఒక మహాకావ్యమని కవయిత్రి, కాలమిస్ట్ పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం శేషేంద్ర శర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శర్మ ప్రముఖ కవిగా, విమర్శకుడిగా, బహు భాషా కోవిదుడిగా తెలుగు సాహితీ వనంలో ఆరు దశాబ్దాలకు పైగా సేవ చేసి యుగ కవిగా కీర్తి గడించారని పేర్కొన్నారు. గొప్ప కవితా వారసత్వానికి గట్టి పునాదులు వేశారని తెలిపారు. ఆధునిక, సంప్రదాయ రీతుల్లో సరి సమానంగా అనేక మధురమైన కవితల్ని రచించారని తెలిపారు. ఆయన రచనల్లో ప్రధానంగా ప్రకృతి, సామాన్య ప్రజల స్థితిగతులు కళ్లకు కట్టినట్లు కన్పించేవని వివరించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కల్చరల్ ఫోరం కార్యదర్శి పి.ఎస్.మూర్తి, ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు తదితరులు నివాళులర్పించి ప్రసంగించారు.

# ఏపీ ఎన్నికల అధికారి తీరు ఏకపక్షం

**వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్**



**పట్నంబజారు:** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషన్‌లు, కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలు ఒకే రకంగా ఉంటే ఏపీ సీఈఓ మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్ ఆరోపించారు. నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ప్రత్యేక రూల్స్ పెట్టి వాటిని ఏపీ సీఈఓ ఆదేశించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎన్నికల కమిషన్ తొలి నుంచి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, పోస్టల్ బ్యాలెట్ అంశంలో ఇది బట్టబయలైందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఏపీ సీఈఓ వ్యవహరించడం సరికాదని ఖండించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరు చూస్తుంటే స్పష్టంగా కూటమికి మద్దతు తెలియజేస్తుందనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాల వల్ల పూర్తి స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న తీరును కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కేంద్ర ఎన్నికల అధికారులు, రాష్ట్రంలో జరుగుతున్న ఏకపక్ష నిర్ణయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# నరసింహ శతకానికి విశిష్ట స్థానం



ప్రసంగిస్తున్న సుందర రామకృష్ణ

**నగరంపాలెం:** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం నరసింహ శతకకర్త శేషప్ప కవి పద్య గానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ నరసింహ శతకంలో పద్యాల్ని రాగయుక్తంగా గానం చేసి, అందులోని భావాల్ని తెలియజేశారు. అన్ని శతకాలలో నరసింహ శతకానికి విశిష్టత ఉందన్నారు. పద్యాల్లో శ్రీమహావిష్ణువును సంబోధించడంలో మృదుత్వం, కాఠిన్యం, బెదిరింపు, కోపం చూపి శేషప్ప తన భక్తి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారని వివరించారు. ఆయన పద్య గానం ఆహూతుల్ని అలరించింది.

**వైభవంగా లక్ష మల్లెల పూజ**



లక్ష మల్లెల పూజలో భక్తులు

**నగరంపాలెం:** నాజ్ కూడలిలోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు గురువారం మూడో రోజుకి చేరాయి. ఉదయం 11 గంటలకు లక్ష మల్లెల పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నూరిశేడి దుర్గావరప్రసాద్, ఈఓ శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, వంశీ, జగదీష్, రమేష్, రమణ పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలు స్వాధీనం

**గుంటూరు ఈస్ట్:** పట్టాభిపురం పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర వాహనాలు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 22 వాహనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలు మరిన్ని రోజులు కొనసాగుతాయన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు బైక్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

**గుంటూరు ఈస్ట్:** వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంటకు చెందిన నందిగం రాజశేఖర్ (34) ప్రతి రోజు మద్యం తాగి భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో ఆమె ఇద్దరు పిల్లలతో మూడు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ ఘటనపై దిశ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరుగుతోంది. దీంతో రాజశేఖర్ మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**డ్రైవర్ ఆత్మహత్యాయత్నం**

వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శివరామ్‌నగర్‌కు చెందిన గుమనంపాటి రాహుల్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇంట్లో జీతం ఇవ్వకుండా ఖర్చు పెడుతున్నాడు. ఇదేమిటని కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో గురువారం ఎలుకల మందు తిన్నాడు. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు.

## ఐఎంఏకు విరాళం

**తెనాలి రూరల్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖకు డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ రూ. 5.40 లక్షలను అందించారు. ఈ మేరకు చెక్కును అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్‌లకు గురువారం ఆయన అందజేశారు. ఏటా ఒక్కో వైద్య నిపుణుడితో తెనాలిలోని వైద్యులకు శిక్షణ, ఉపన్యాసం ఇప్పించి ఆయనకు బంగారు పతకం అందించాలని డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ కోరారు. తమ వివాహ దినోత్సవం సందర్భంగా విరాళాన్ని అందించినట్టు తెలిపారు.

# వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు



శారదా పీఠ పరిపాలిత దేవస్థానంలో స్వామి

**నగరంపాలెం:** పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విష్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, ఋత్విక్వరణం, గణపతి హోమం, లక్ష్మీ నారాయణ హోమం, నవగ్రహ హోమం, వేద పండితుల మంత్రాలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు జరిపారు. భక్తుల రాకతో దేవాలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కాసుల వెంకటశివప్రసాద్, గ్రంధి కోటీశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం తొండెపు రవి దంపతుల్ని పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు.



ఏటుకూరు రోడ్డులోని ఆలయంలో హోమం నిర్వహణ

**భక్తిశ్రద్ధలతో హోమాలు**

ఏటుకూరు రోడ్డులోని శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్ని పాలక మండలి ఆధ్వర్యంలో రాజకుమార్‌శర్మ అర్చకత్వంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం నిత్య పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో భూవారాహి హోమం (భూ సంబంధిత సమస్యలకు) పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం కార్త వీర్యార్జున హోమం (రుణ సంబంధిత సమస్యలకు) నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు గుంటూరు నగర, శివార్లల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉత్సవ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, చల్లని మజ్జిగను అందించారు.

# మ్యాజిక్ బస్‌తో చలమయ్య కళాశాల ఒప్పందం

**గుంటూరు ఎడ్యుకేషన్:** సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణప్రభు మాట్లాడారు. ఒప్పందంలో భాగంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్ని విదేశీ యూనివర్సిటీలకు ఉన్నత చదువుల కోసం పంపుతామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం 2024–25 సంవత్సరానికి వర్తిస్తుందన్నారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ కార్యకలాపాలు వివిధ దేశాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు కర్నూరపు సూర్యనారాయణ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఎన్. కిరణ్‌కుమార్, ఎన్. దిలీప్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ. శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.





మ్యాజిక్ బస్ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న రామకృష్ణప్రభు

# తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించాలి

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు రోజు ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజులపాటు శిక్షణ తీసుకున్న వారు ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి ఇంటింటిని సందర్శించాలని ఆదేశించారు. క్యాన్సర్ లక్షణాల్ని తొలి దశలోనే గుర్తించి, అనుమానాస్పద క్యాన్సర్ కేసుల్ని అవసరాన్ని బట్టి మెడికల్ కాలేజీకు రిఫర్ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ

**కళాశాలలో జాబ్ అచీవర్స్ డే వేడుకలు**

**గుంటూరు రూరల్:** ప్రతి విద్యార్థికీ నైపుణ్యతతో కూడిన విద్యను అందించటంతో పాటు ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల జాబ్ అచీవర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసుకున్న మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 48 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సూర్యటెక్ సొల్యూషన్స్, లాగిస్కిం సొల్యూషన్స్ వంటి సంస్థల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించటం సంతోషకరమన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

# ‘పొగ’చూరుతున్న బతుకులు

**నేడు నో టుబాకో డే**

- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ.200 వరకు జరిమానా
- పొగాకు వినియోగంతో అనేక నష్టాలు

**గుంటూరు మెడికల్ :** యవ్వనంలో ఫ్యాషన్ కోసమో... సరదా కోసమో చేసే ధూమపానం చివరకు ప్రాణాలకు ముప్పు తెస్తోంది. సిగిరెట్, బీడీ, చుట్ట తాగే అలవాటు వ్యసనంలా మారి మనిషిని తనకు బానిసను చేసుకుంటోంది. స్మోకింగ్, పొగాకు ఉత్పత్తుల మోజులో పడి యువత, భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటోంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో 40 శాతం మంది పొగ తాగటం, పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారానే వ్యాధుల బారిన పడి మరణిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ధూమపానంతో కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా మే 31న నో టుబాకో డేను నిర్వహిస్తున్నారు.

**జిల్లాలో బాధితులు అధికమే...**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 35 శాతం మంది యువత స్మోకింగ్‌కు ఎఫెక్ట్ అయ్యారు. జిల్లాలో వివిధ రోగాలతో 30 నుంచి 39 ఏళ్ల వయస్సు వారిలో ప్రతి ఐదుగిరిలో ఒకరు పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన చనిపోతున్నవారే. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతినెలా 1,200 మంది పురుషులు, రెండు వేల మంది మహిళలు వివిధ రకాల క్యాన్సర్‌లతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 శాతం మంది కేవలం పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్లే క్యాన్సర్ బారిన పడ్డారు. జిల్లాలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించేందుకు 15 ఆస్పత్రులు, క్లినిక్‌లు ఉన్నాయి. వీటిల్లో ప్రతిరోజూ 400 మంది వరకు చికిత్స పొందుతున్నారు.





జీజీహెచ్‌లో పొగాకు అలవాటు మాన్పించే కేంద్రం

**చట్టం ఏం చెబుతుందటే..**

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం రైల్వే స్టేషన్లు, సినిమాహాల్స్, బస్ స్టేషన్లు, జనసంచారం ఉండే మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదు. ముఖ్యంగా పాఠశాలలు, గుడులకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మడం చట్టరీత్యా నేరం. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు చట్టరీత్యా అమ్మకూడదు. వారితో విక్రయించరాదు. చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ.200 వరకు జరిమానా విధిస్తారు. ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మాత్రమే చేసేందుకు అనుమతించాలి.

**జీజీహెచ్‌లో ఉచిత కౌన్సెలింగ్**

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని విడనాడాలనుకునేవారికి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి మందులు అందిస్తున్నారు. 2019 నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లో పొగాకు వినియోగం అలవాటును మాన్పించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది 1,069 మందికి చికిత్స అందించడం ద్వారా కొంత మంది స్మోకింగ్ అలవాటును విడనాడారు. స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఛాతీ ముందు భాగంలో, భుజానికి, తొడకు ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని ప్రాంతంలో నికోటిన్ ట్రాన్స్‌ధర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. ఈ ప్యాచ్ అంటించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా ప్రతినెలా పది మందికి పైగా పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్ తెలిపారు.

**క్యాన్సర్‌కు ఆధునిక వైద్యసేవలు**



క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే వారిలో 40 శాతం మంది పొగాకు, దాని ఉత్పత్తుల వాడకం వల్ల గురవుతున్న వారే. పొగ తాగటం, పొగాకు ఉత్పత్తులు ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ లాంటి వాటిని వినియోగించటం వల్ల నోరు,గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉండటం ద్వారా త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

**ధూమపానంతో గుండె జబ్బులు**



పొగ తాగేవారిలో రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొగాకులో 400 రకాల విష పదార్థాలు ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ వల్ల గుండెపోటు, టార్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. నపుంసకత్వం, పక్షవాతం పొగరాయుళ్లను వదలవు. పొగ తాగే వారికి చుట్టుపక్కల ఉన్నవారిపై కూడా పొగాకు ప్రభావం ఉంటుంది. గుండె జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చేవారిలో 70 శాతం మంది ధూమపాన ప్రియులే.

– డాక్టర్ డాక్టర్ బాపిరెడ్డి నారాయణరెడ్డి, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు

## చలపతి ఫార్మసీలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

**గుంటూరు రూరల్:** ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్(ఏపీసీఏ), శ్రీ ఆనంద్ చెస్ వింగ్ (ఎస్ఏసీడబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి చెస్ ఓపెన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టోర్నమెంట్‌ను జూన్ 2న లాం నందున్న తమ కళాశాల ఆవరణలో నిర్వహించటం సంతోషకరమన్నారు. మొత్తం 8 రౌండ్స్‌గా ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు రూ.1.10 లక్షల నగదు బహుమతులను అదే రోజున అందజేస్తారన్నారు. ఈ టోర్నమెంట్‌ను 7, 9, 11, 13, 15 ఏళ్ల వయస్సు గల బాలబాలికలకు నిర్వహిస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేస్తామని తెలిపారు. జనరల్ కేటగిరిలో మొదటి 20 మంది విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ వెటరన్, బెస్ట్ ఉమెన్, బెస్ట్ గుంటూరు, బెస్ట్ పీహెచ్ ప్లేయర్లకు బహుమతులు అందిస్తామని ఆయన చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు రూ.1000 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు క్రీడాకారులు ఎం. గోపీనాథ్‌ను 9703049378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పీఈటీలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న డాక్టర్ రామారావు, అసోసియేషన్ సభ్యులు

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తెనాలిరూరల్:** తెనాలి–విజయవాడ రహదారి వెంబడి వీఎస్సార్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. కళాశాల సమీపంలోని వినాయకుడి విగ్రహం వద్ద మృతదేహం ఉంది. వయసు సుమారు 65 ఉంటుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశ్ తెలిపారు.